జోరుగా వేరుశనగ సాగు

కోడేరు: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వేరుశనగ పంట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. జొన్నలబొగుడ రెండో లిఫ్ట్ నుంచి సాగు నీరు విడుదల చేయడంతో వేరుశనగ, మినుము తదితర పంటలు సాగు చేయడంలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో దాదాపు 52 వేల ఎకరాల భూమి ఉండగా వానాకాలంలో 18591 ఎకరాలలో రైతులు పంటలను సాగు చేశారు. వానాకాలంలో వర్షాలు కురియకపోవడంతో పంటలు చేతికి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. యాసంగిలో సెప్టెంబర్ నుంచి ప్రారంభమైన పంటలకు రైతులు వివిధ పంటలను సాగు చేసేందుకు నిమగ్నమవుతున్నారు. కేఎల్ఐ అధికారులు నీరు వదలడంతో చెరువులు, కుంటలు నిండాయి. బోరు బావుల్లో నీటి మట్టం పెరగడంతో రైతులు ఇప్పటి వరకు వేరుశనగ 1500 ఎకరాలు, మినుములు 1000 ఎకరాలలో సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. యాసంగిలో 16 వేల ఎకరాలు రైతులు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని వ్యవసాయాధికారులు అంచనా వేశారు.


కోడేరులో సాగు చేసిన వేరుశనగ పంట

నాలుగు ఎకరాల్లో సాగు



నాలుగు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశాను. కేఎల్ఐ కాలువల ద్వారా నీరు విడుదల కావడంతో యాసంగిలో పంటలు సాగు చేశాం. అధిక దిగుబడులు సాధించేందుకు అధికారుల సూచనలు పాటిస్తాం.

–స్కైలాబ్, రైతు

మరింత సాగు పెరిగే అవకాశం

యాసంగిలో వేరుశనగ సాగు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం పంట సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పంట అధిక దిగుబడి సాధించేందుకు వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు పాటించాలి. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి.

– శ్రీరాం, వ్యవసాయాధికారి, కోడేరు

కొల్లాపూర్ కోటపై మళ్లీ గులాబీ జెండానే..

కొల్లాపూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కొల్లాపూర్ కోటపై ఎగిరేది గులాబీ జెండానే అని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని ఎస్ఎం గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానన్నారు. సోమశిల వంతెన, జాతీయ రహదారి, హార్టికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాల మంజూరు చేయించానని, తాగునీరు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యానికి సంబంధించిన సౌకర్యాలు మెరుగుపర్చానని వివరించారు. ప్రజలు విజ్ఞతతో ఓటువేయాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాల వివరాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందని ఆయన సూచించారు. రాష్ట్ర నాయకుడు రంగినేని అభిలాష్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బోజ్యానాయక్, గొర్రెల కాపరుల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

సంఘం జిల్లా అధ్యక్షుడు గాలియాదవ్, నాయకులు శంకర్‌నాయక్, పాండునాయక్, దశరథం నాయక్, దర్గయ్యయాదవ్, కలమూరి నిరంజన్, కోంగ్ర బిచ్చన్నతో పాటు పలువురు ఉన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

సమావేశంలో ముక్కిడిగుండం, మొలచింతలపల్లి, నార్లాపూర్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం ఎమ్మెల్యే నివాసం వద్ద పాన్‌గల్ మండల దొండాయిపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పారు.

కనులపండువగా అమ్మవారి శోభాయాత్ర



లింగాల: మండల కేంద్రంలోని పాతబజార్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాన్ని గురువారం నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారిని ప్రతిష్ఠించి పట్టణ పుర వీధుల గుండా ఊరేగించారు. డీజే సౌండ్లు, మహిళల కోలాటాలు, భజన కీర్తనలు, బతుకమ్మలు, వీరభద్రుని సేవ తదితర విన్యాసాలు పలువురిని అలరించాయి. అమ్మవారిని సమీపం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యం

కోడేరు: కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం మండల కేంద్రానికి చెందిన 120 మంది బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జూపల్లి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్ రావు, కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖరీం, సురేందర్‌రెడ్డి, గోవింద్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి, మిద్దె రామకృష్ణ, శరత్, మంగలి శేఖర్, బాబు, చలపతిరావు, మాజీ వార్డు సభ్యులు రాజు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వెల్దండ: మండలంలోని రాచూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 100 నాయకులు


వెల్దండలో కాంగ్రెస్ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

గురువారం ఎమ్మెల్సీ, కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సంజీవ్‌కుమార్‌యాదవ్, గున్నెల శ్రీనివాసులు, కార్యకర్తలు ఉన్నారు.

కందనూలు: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ సమక్షంలో బీజేపీ ముఖ్య నేత, మాజీ ఎంపీపీ తిరుపతి రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, పీసీసీ వైస్ ప్రసిడెంట్ మల్లురవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



చారకొండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి అధికారులతో అభివృద్ధి పనులపై గురువారం ఎంపీడీఓ జయసుధ సమీక్ష నిర్వహించారు. ఉపాధి పనులపై పూర్తి వివరాలు, ఆధార్ సీడింగ్, ఉపాధి కూలీల పేమెంట్, ఎస్ఎంఎంఎస్ తదితర వాటిపై సమీక్షించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతపై నిత్యం ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీఓ వెంకటేష్, ఏపీఓ లక్ష్మయ్య, ఉపాధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం



తెలకపల్లి: మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బైకాని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరు పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థల చైర్మన్ హనుమంతురావు, ఎంపీపీ కొమ్ము మధు, ఎంపీటీసీ సభ్యులు రమేష్, లక్ష్మమ్మ, మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, కార్యదర్శి కొత్ర శ్రీనివాసులు, సింగిల్‌విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పెద్దపల్లి బంగారయ్య, సంతోష్‌రెడ్డి, భాషమోని రాములు, కృష్ణయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మండల కేంద్రంలో గురువారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమేష్, ఉపసర్పంచ్ కృష్ణయ్య, శ్రీను పాల్గొన్నారు.

నర్సరీ సంరక్షణకు చర్యలు



చారకొండ: నర్సరీ సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీఓ జయసుధ అన్నారు. గురువారం మండలంలోని జూపల్లిలో నర్సరీని ఆమె సందర్శించారు. నర్సరీలో ఉన్న మొక్కలు, వాటి సంరక్షణపై తీసుకుంటున్న జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శి మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. హరితహారంలో మొక్కలు నాటేందుకు నాణ్యమైన విత్తనాలను సిద్ధం చేసి పెంచాలని ఆదేశించారు. బెడ్లు, మట్టిని పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యమైన విత్తనాలను మట్టితో నింపాలన్నారు. ఆమె వెంట ఎంపీఓ వెంకటేష్ ఉన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం



తెలకపల్లి: హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం అయ్యిందని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏఐవైఎఫ్ రెండో రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29, 30న హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దళిత ముఖ్యమంత్రి, మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం ఏమయ్యాయని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పరీక్షా పత్రాల లీక్, రద్దు కారణంగా నిరుద్యోగులు రోడ్డున పడ్డారన్నారు. నిరుద్యోగభృతి, ఉచిత ఎరువులు, రైతు రుణమాఫీ, పంటనష్ట పరిహారం ఊసే లేదని విమర్శించారు. రేషన్ కార్డులు లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలకు బుద్ధిచెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి వేనెపల్లి రవిందర్, మహేష్, విష్ణు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత



తాడూరు: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రంలోని సమీపంలో కల్వర్టు దగ్గర ఉన్న పెద్ద గుంత ఉంది. దీంతో ఈ రహదారి గుండా వెళ్లే వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కు బిక్కు మంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. కొంచెం అజాగ్రత్తగా వెళ్లినా అంతే సంగతులు. ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డు కావడంతో వాహనాలు ఎప్పుడు రద్దీగా రాకపోకలు కొనసాగిస్తాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

గౌడ కులస్తులు ఏకం కావాలి



వెల్దండ: గౌడ కులస్తులు ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని గౌడ సంక్షమ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్యగౌడ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిమ్మినోనిపల్లిలో నిర్వహించిన గౌడ కులస్తుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గౌడ కులస్తులు ఆర్థికంగా, రాజకీయంగా రాణించాలన్నారు.

నూతన గ్రామ కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రవిగౌడ్, ఉపాధ్యక్షుడిగా కృష్ణాగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శివరాజ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా వెంకటేష్‌గౌడ్, రామస్వామిగౌడ్, కృష్ణాగౌడ్‌తో మరో కొంతమందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మదన్‌గౌడ్, విష్ణుగౌడ్, కృష్ణాగౌడ్ తదితరులు ఉన్నారు.

అచ్చంపేట సభకు తరలిన నాయకులు

చారకొండ: అచ్చంపేటలో గురువారం నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ఎంపీపీ నిర్మల విజేందర్ గౌడ్, మండల అధ్యక్షులు ఏదిరే రవీందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుర్వయ్య గౌడ్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.


చారకొండ నుంచి వెళ్తున్న నాయకులు

ఉప్పునుంతల: మండల కేంద్రం నుంచి పలు వాహనాల్లో అచ్చంపేట సభకు బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. రవీందర్‌రావు, సత్తు భూపాల్‌రావు, కట్టా గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బల్మూర్: అచ్చంపేట సభకు తరలిన వారిలో ఎంపీపీ అరుణ, మండల నాయకులు నర్సయ్య, చుక్కారెడ్డి నాయకులు ఉన్నారు.

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో సభకు తరిలారు. సైదులు, వెంకటయ్య, కృష్ణయ్య, పర్వతాలు, నర్సింహా, శ్రీను, మహిళలు తదితరులు ఉన్నారు.

లింగాల: మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అచ్చంపేటకు సభకు భారీగా తరలివెళ్లారు.

గ్యారంటీ పథకాలు అమలు చేస్తాం


లింగాలలో కరపత్రాలను విడుదల చేస్తున్న డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ

లింగాల: కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేసి తీరుతామని డీసీసీ అధ్యక్షుడు, అచ్చంపేట కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మేరమ్మ భవానీ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యకర్తలు బూత్ స్థాయిలో ప్రతి ఇంటింటికి వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి భాగ్యబాయి, రాజేందర్, ఇందిరమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని తిమ్మాయిపల్లి, సారంబండ తండాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల కార్డుతో ప్రచారాన్ని నిర్వహించారు. మహిళలు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందని వివరించారు. కార్యక్రమంలో తిమ్మాయిపల్లి గ్రామ అధ్యక్షుడు శ్రీపతి రావు, నాగర్జున, శ్రీకాంత్ రావు, జైపాల్, రమేష్, లింగం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై సర్వే

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలో కాంగ్రెస్ ఓటు బ్యాంకుపై డీసీసీ ఉపాధ్యక్షుడు కొయ్యల శ్రీనివాసులు ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో గురువారం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించిన జిల్లా కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ ఓటర్లతో పాటూ తటస్తంగా ఉన్న ఓటర్లను వారు కలిశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రాజ్‌గోపాల్, సైదులు, ఎంపీటీసీలు, నాయకులు నీరంజన్, ఆనంద్, శ్రీనివాసులు, మల్లయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల ఫిర్యాదు సిగ్గుచేటు

కల్వకుర్తి: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమాను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర అధినాయకత్వం కోరడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వారి కుటిల రాజకీయాలను ఎండగడదామన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రైతులు, ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, వైస్ ఎంపీపీ గోవర్ధన్, కౌన్సిలర్ సూర్యప్రకాష్‌రావు, మనోహర్‌రెడ్డి, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మ దహనం


తిమ్మాజీపేటలో కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


వెల్దండలో

కల్వకుర్తిరూరల్: రాష్ట్రంలో రైతుబంధు పథకాన్ని నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేయడంతో గురువారం పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం, నాయకులు పాల్గొన్నారు.

తాడూరు: రాష్ట్రంలో అమలవుతున్న రైతుబంధు, దళితబంధు పథకాలు నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు కోరడాన్ని నిరసిస్తూ గురువారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. సంక్షేమ పథకాలను అడ్డకోవడంపై విచారం వ్యక్తం చేశారు. అనంతరం కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల అధ్యక్షుడు యారరమేష్, నాయకులు పర్వతాలు, అనీల్‌రెడ్డి, గౌరికుమార్, మహేందర్, కేశవులుగౌడ్, ప్రతాప్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలో గురువారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ప్రభుత్వ పథకాలను ఏవిధంగా మంజూరు చేస్తారంటూ రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు.

వెల్దండ: మండల కేంద్రంలోని హైదరాబాదు–శ్రీశైలం జాతీయ రహదారిపై బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపి కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. భూపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, భాస్కర్‌రావు, నిరంజన్, అంజినాయక్, శేఖర్‌ముదిరాజ్, ప్రసాద్, శేఖర్, శ్రీను ఉన్నారు.

రోడ్డు ఇలా.. వెళ్లేది ఎలా?


కంకర తేలిన సాతాపూర్ బీటీ రోడ్డు

పెద్దకొత్తపల్లి: మండలంలోని సాతాపూర్ నుంచి అచ్చంపేటకు వెళ్లే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై కంకర తేలింది. అదేవిధంగా గుంతలు ఏర్పడటంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ రోడ్డు గుండా ప్రతి రోజు అచ్చంపేట నుంచి కొల్లాపూర్‌కు ఆర్టీసీ బస్సులు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. యాపట్ల నుంచి సాతాపూర్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో బస్సులు సమయానికి చేరుకోలేకపోతున్నాయి. మారేడుమాందిన్నె, కొత్తయాపట్ల, పాతయాపట్ల, చంద్రబండతండా, రాయవరం, చిన్నకొత్తపల్లి, జగన్నాథపురం గ్రామాల ప్రజలు ఈ మార్గం ద్వారా వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

క్లుప్తంగా

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

కోడేరు: విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని డాక్టర్ దశరథం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆస్పత్రిలో ఏఎన్ఎంల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తప్పనిసరిగా ఏఎన్ఎంలు సబ్‌సెంటర్ల వద్ద అందుబాటులో ఉండి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులు చేసుకొనేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మంగమ్మ, మల్లేష్, నారాయణ పాల్గొన్నారు.

నాణ్యమైన మట్టిని నింపాలి



తాడూరు: నర్సరీలలో పెంచే మొక్కల కోసం కవర్లలో సారవంతమైన మట్టిని నింపాలని ఎంపీడీఓ గంగామోహన్ కోరారు. గురువారం మండల కేంద్రంతోపాటు ఇంద్రకల్, లచ్చిరాం తండాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వాహకులు ఉపాధి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయా గ్రామాలలో ఉపాధి హామీ ద్వారా చేపట్టిన నర్సరీలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అడవి పందులను చంపొద్దు

కోడేరు: మండలంలోని ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ పొలాల వద్ద అడవి పందులను చంపేందుకు విద్యుత్‌షాక్ పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఈ ఓమేశ్‌గౌడ్ హెచ్చరించారు. రాత్రి వేళలో విద్యుత్ షాక్ పెట్టడం వల్ల పాడి పశువులు, ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. ఫీడర్ ట్రిప్ అయ్యి విద్యుత్ బ్రేక్‌డౌన్ అవుతుందన్నారు. పొలాల చుట్టూ విద్యుత్ షాక్ పెడితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

కొల్లాపూర్: పట్టణంలోని మహబూబ్ సుభానీ దర్గా గంధోత్సవం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జామెమజీద్ నుంచి గంధోత్సవం ప్రారంభమైంది. ప్రధాన వీధులగుండా ఊరేగిస్తూ దర్గా వద్దకు తీసుకొచ్చారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆఫీసాహెబ్ హాషం ఘత్తారీ, మసీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజా చావుష్, జాఫర్, యూనీస్, ఖాజామొయినోద్దీన్, నయూమ్, తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం మహబూబ్‌స్వామి దర్గాలో భక్తులు గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శేఖర్, రవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్యార్మీ

చారకొండ: మండలంలోని జూపల్లిలో శుక్రవారం గ్యార్మీ పండుగ సందర్భంగా మహబుసాని దర్గా కమిటీ ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం కందూరు, ఫతేహా, దీపారాధన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


భీమ్‌రెడ్డి(ఫైల్)

లింగాల/కోడేరు: మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భీమ్‌రెడ్డి(50) గురువారం గుండె పోటుతో మృతి చెందాడు. స్వగ్రామమైన గోపాల్‌పేట మండలం సింగరాయపల్లిలో గుండెపోటుతో కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం వనపర్తి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తోటి ఉపాధ్యాయుడు ఆకస్మాత్తుగా మృతి చెందడంపై ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

సింగోటంలో బీజేపీ పరివర్తన్ యాత్ర

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు ఆధ్వర్యంలో బీజేపీ పరివర్తన్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నాన్నారు. కొల్లాపూర్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారికి నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామని గుర్తుచేశారు. సోమశిల– సిద్దేశ్వరం బ్రిడ్జి మంజూరు చేయించామన్నారు. ఈ ఎన్నికలలో బీజేపీని ఆశీర్వదిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.